'అద్దేపల్లి ప్రభు' కథలు – మానవతా ధోరణులు

డా. శేఖర్ కోలా,

తెలుగు అధ్యాపకులు,

ఆంధ్ర లొయోల కళాశాల, విజయవాడ.

9441441097, kolasekhara@gmail.com

అద్దేపల్లి ప్రభు గొప్ప కథా రచయిత. వీరి కథాకథనం అద్భుతంగా ఉంటుంది. ఆధునిక కథా రచయితలలోనే మంచి కథకునిగా పేరు పొందారు. ప్రభు అద్దేపల్లి తూర్పు గోదావరి జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 'విలువలు' 1984లో అరుణతారలో అచ్చయింది. దాదాపు ఇరవై కథలు రాశారు. రెండు కవితా సంపుటాలు ప్రచురించారు. అద్దేపల్లి ప్రభుగారు రచించిన 'ఇస్సాకు చిలక, ఊరు గోదారి, అతడు మనిషి' అనే మూడు కథలను తీసుకొని వాటిల్లోని మానవతా ధోరణులను పరిశోధనాత్మకంగా వివరించడమే నావ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

'ఇస్సాకు చిలక'. అద్దేపల్లి ప్రభు రాసిన కథ. మంచి మానవత్వపు విలువలను చాటిన కథ. దళితులను పెత్తందారులు ఎలా మోసం చేస్తారో గొప్పగా వివరించిన కథ. పాలకులు ఎప్పుడూ అమాయకులను వంచిస్తారనే నగ్న సత్యాన్ని మరోసారి బలంగా నిరూపించిన కథ. ఈ కథ చినుకు వార్షిక ప్రత్యేక సంచికలో మే–జూలై 2014న ముద్రించారు. 'ఇస్సాకు చిలక' కథ చిలుక ఫ్లాష్‌బ్యాక్ పద్ధతిలో నడిచిన కథ.

ఇస్సాకు స్వభావరీత్యా జగడాల మారి. కాని ఎవరికి హానిచేసేవాడు కాదు. తన మనస్సులో ఏముందో అదే అందిరితో అనేవాడు. పల్లెకి వాడో కాలక్షేపం. ఆ చుట్టుపక్కల పల్లేల్లో ఇస్సాకు ఒక్కడే పదోతరగతి వరకూ చదువుకున్నోడు. కాకపోతే పాసవ్వలేదు. ఇంతలో ఇస్సాకుకి పెళ్ళి, ఆ వెంటనే ఇద్దరు పిల్లలు. వద్దు వద్దంటున్నా భార్య కొయిటా వెళ్ళిపోవడంతో ఇస్సాకు అగ్గిమీద గుగ్గిలమై పోయాడు. కానీ చేసేదేముంది. మెల్లగా పిల్లల్ని చూసుకుంటూ కొయిటానించి వచ్చే డబ్బుతో తాగి తందనాలాడ్డం అలవాటైపోయింది. కూలిపన్లకీ, కాకినాడ సెక్యూరిటీకీ వెళ్లడం మానేశాడు. ఒక్క ఎలకలు పట్టడం మాత్రం మానలేదు.

ఆ అందమైన పల్లెకు విలన్ భూస్వామి చౌదరి. అమాయకపు ప్రజలను వంచించటంలో బాగా ఆరితేరాడు. చౌదరీ, ఇస్సాకు పదోతరగతి వరకూ కలిసే చదువుకున్నారు. ఇద్దరికీ చదువు మాత్రం అబ్బలేదు. పదో తరగతి ఫేలయిపోయి ఎవరి పనుల్లో వాళ్లు పడిపోయారు. అంతదాకా చౌదర్ని ఒరే అని పిలిచే ఇస్సాకు మెల్లిగా అండిలోకి, గారులోకి వచ్చేశాడు.

ఇస్సాకు స్వభావరీత్యా అందరి బాగుకోరే మానవతావాది. కాలవపూడిక తీయ్యడానికి మనుషులను కాక మిషిన్ని తీసుకొనివస్తే ఊరందరి ముందు నిలదీస్తాడు. "మూడేళ్లనించీ కాలవపూడికలు తీలేదు. ఈసారి తీయాలన్నారు. బానేఉంది. మాకేదో పని దొరుకుతుందని నాలుగు డబ్బులొత్తాయనీ అనుకుంటే పొక్లీనరుతో సేయిద్దమంటారు. మరి మేం బతికేదెట్టా?" అంటూ చౌదరీని ప్రశ్నిస్తాడు. కొంతమంది చౌదరి డబ్బుకీ అధికారానికీ

భయపడి అతనికి తొత్తులుగా మారినవారు ఇస్సాకుని అక్కడినుంచి పంపించివేస్తారు. ఈ విధంగా ఇస్సాకు అందరి బాగేతనబాగు అనుకునే మానవతావాది.

ఇస్సాకు కోపమేకాదు లౌక్యంకూడా తెలిసిన తెలివైనవాడు. "బాబూ... చౌదరిబాబు తవరి మాటకడ్డు వచ్చా ననేటనుకోకండి. తమరి గెడ్డం కింద గెంజి తాగి బతికెటోళ్లం. కోపమైపోకండిగానీ తవరంత ఎదవ నా కొడుకు ఈ వూల్లోనే కాదు. ఈ సుట్టుపక్కల ఏడా కనపడ్డండి." అంటూ అతనిలోని లోపాన్ని జనం మద్యలోనే ఎత్తిచూపుతాడు.

తప్పుచేస్తే తనవారినిసైతం వదలని ఉత్తమగుణం కలవాడు ఇస్సాకు. కాలువపనుల విషయంలో కమ్యూనిస్టుగా చెప్పుకొనే దావీదుని పట్టుకొని "ఓహో... పెద్ద కమ్యూనిస్టు కదా... ఎవుడి గురించీ ఈడికక్కర్లేదు... దావీదు బాగోతం చౌదరి కెరుక... చౌదరి బాగోతం దావీదు కెరుక. ఆడి ఈడి గోత్రాలో... బొక్కల్లోంచి సూసే ఎలకలకెరుకో..." వారి బంధాన్ని అందరికీ చూపిస్తాడు.

మరో సందర్భంలో వాళ్లకు ప్రభుత్వం ఇస్తున్న స్థలంలో చేరువు పేరుతో చౌదరి కబ్జాచేస్తున్న సందర్భంలో "తవ్వేత్తన్నాడా... తవ్వేస్తడ్రా... చౌదరిబాబు పోక్లీనరు తెచ్చినప్పుడే అనుకున్నాను. తోకలేని దావీదుగాడు ప్రెసిడెంటయ్యినపుడే చౌదరిగాడికి కొమ్ములొచ్చినాయ్... ఇప్పుడేటి పీకుతారు?" అంటూ ప్రజలను సంఘటితం చేయటానికి ప్రయత్నంచేస్తాడు.

ఇస్సాకు పల్లెప్రజలకు మార్గదర్శి. చౌదరి కుట్రలు ముందే గ్రహిచేవాడు. అక్కడే ఆగేవాడుకాదు, తన జాతిని జాగృతం చేస్తాడు.కాలువ పూడిక తీసే సందర్భంలో "ఓరే పెద్దోడా... అనకూడదుగానీ నువు చౌదరి బాబు కన్నా ఎదవ్వి... ఈయేల ఈ మిసను తెచ్చారు. రోపింకోటి తెత్తారు. అపుడేటి సేత్తావ్?" అని వారిని ఆలోచింపచేస్తాడు. ఇస్సాకు అనుకున్నట్లుగానే చౌదరి చెరువు పనులకు కూడా పల్లెకు పనికల్పించడు. మిషనుతోనే పూర్తిచేసి వారి నోటికాడ కూడు తీస్తాడు. తమ స్థలంపోయిందని పల్లె కన్నీరు పెడుతుంటే, ఇస్సాకు చూస్తూ ఊరుకోడు. వారికి ఏలాపోరాడాలో కర్తవ్యాన్ని బోధిస్తాడు.

"నువ్వట్టగే అంటావుగానీ భూమి కావాలంటే భూమ్మీద నిలబడి దెబ్బలాడ కుండా ఆఫీసుల చుట్టూ తిరుగుతారేట్రా..." అంటూ తిరగబడాలని ప్రబోధిస్తాడు. పోరాటంలో తాను ముందుంటానంటాడు. కాని వాళ్లు సూర్రావుతో కలెక్టర్ ఆఫీసుకు పోవటానికి నిర్ణయించుకుంటారు. అప్పుడు కూడా వాళ్లమీద జాలీచూపిస్తాడు కాని తనవాళ్లను వదులుకోడు. "ఓరే.. సూర్రావూ నీక్కావల్సిందేటో నాకు తెల్సుగానీ.. నేనో ప్లాను చెపుతా యినుకో... చౌదరి బాబుగారు మమ్మల్ని కొట్టేశాడని మీ కమ్యూనిస్టోళ్లందర్నీ తీసికెళ్లి కలెక్టరాఫీసుకాడ ధర్నాచేసేయ్... అప్పుడు దిగుతాడు చౌదరి బాబుగారు" అంటూవారికి ధైర్యాన్ని అందిస్తాడు.

ఇంతలా ఊరికోసం తపించే ఇస్సాకునిగానీ, అతని మనస్సునిగానీ పల్లె అర్థంచేసుకోదు. చౌదరి మాత్రం పసిగడతాడు. ఎప్పటికైనా ఇస్సాకే అతకు అడ్డమని గ్రహిస్తాడు. తనవారితోనే మందు ఎక్కువతాగిస్తాడు ఇస్సాకుకి. అదే అతని చివరి రాత్రని తెలుసుకోలేకపోతాడు. కాని నోరులేని చిలుక మాత్రం ముందేవూహించి బోరుబోరున గోలచేస్తుంది.కాని దానిని ఎవరు పట్టించుకోరు.

మనిషి పోయాకే అతని గొప్పతనం ప్రజలు గ్రహిస్తారనే లోకోక్తిని నిజం చేస్తూ "ఆడు స్థిరం తక్కువ్వోడే కానీ ఆడు చెప్పినవన్నీ మాత్రం నిజాలేరా... ఆడు నిక్కార్సయిన మనిషి" సూర్రావు లోకానికి చాటుతాడు.

అద్దేపల్లి ప్రభు కథకు 'ఇస్సాకు చిలక" అని పేరుపెట్టి దానికి న్యాయం చేశాడు. కథ ప్రారంభం, ముగింపు రెండూ చిలకతోనే. మనిషికన్నా పక్షులకు విశ్వాసం ఎక్కువనే సత్యాన్ని మరోసారి ఈ కథద్వారా నిరూపించాడు.

ఇస్సాకు, దావీదు, మరియమ్మ కథలో 'భారతాన్ని' చొప్పించి కొత్త ప్రయోగం చేశారు అద్దేపల్లి ప్రభు. ఎలకల్ని పట్టడంలో ఇస్సాకుని మించిన మొనగాడు ఆ చుట్టుపక్కల ఎక్కడాలేడని చెపుతూ "సాదేవుడికి అశ్వహృదయం తెలిసినట్టు నాకు ఎలక హృదయం తెల్సు. కాబట్టి నేను పంచపాండవుల్లో సాదేవుళ్లాటోణ్ణి" సహదేవున్నీ మరియు పంచపాండవున్నీ తీసుకొచ్చాడు.

మరోసందర్భంలో భూమి కావాలంటే భూమ్మీద నిలబడి పోరాడాలంటూ "భారతంలో పంచపాండవులు ఏ ఆఫీసుల చుట్టూ తిరగలేదు. కురుక్షేత్రంలో నిలబడి దెబ్బలాడారు. తెల్దా ఏటి?"

అంతేకాకుండా అద్దేపల్లి ప్రభు ఒక్క కథలోనే ఇస్సాకుతో పాటు, చిలక కథకూడా నడిపి కథలో నూతన ప్రయోగానికి మార్గం చూపటంతోపాటు, చేసిచూపి తరువాతి కథా రచయితలకు నూతన మార్గాన్నివేశారు.

"ఊరు గోదారి" అద్దేపల్లి ప్రభుగారి మరోకథ. గొప్ప మానవతా నీడలుగల కథ. గోదావరి ఒడ్డున ఉన్న ఒక చిన్నగ్రామం కథ. 'ఊరు గోదారి' కథ 2008 ఫిబ్రవరి 3 న ఆదివారం వార్తలో ప్రచురితమైనది. కథ మొత్తం మణికంఠ చుట్టూనే తిరుగుతుంది. చిన్న పిల్లవాడు. అమ్మ చెల్లిపోయాక వాడి తండ్రి ఇంకో పెళ్లిచేసుకుని వెళ్లిపోతాడు. మణికంఠ అమ్మమ్మ తాత దగ్గర పెరుగుతాడు. వారి గ్రామం గోదావరి ఒడ్డున. గోదావరే అతని ప్రపంచం. ఊళ్లింక లెగకముందే లేచి గోదారిలో ఆడుకోవటం మణికంఠకు చాలా ఇష్టం. దినమంత ఏదోపని చూసుకొని మళ్లీ పొద్దోయాకా నారింజ గోదారి మీద పక్షులు నల్లగా కనిపించే సమయాన వస్తాడు. గోదారిని నిద్రలోకి పంపి ఇంటికి వెళ్లతాడు మణికంఠ. ఇది అతనికి రోజు అలవాటు.

ఇలా వారిజీవితాలు అందంగా గడిచిపోతుండగా, ఇంతలో పిడుగులాంటి వార్త ఒకటి "గోదారి మీద ఆనకట్ట కడతారట... ఊళ్లకి ఊళ్లు మునిగిపోతాయట... మనూరు కూడా మునిగిపోద్ది... కాబట్టి ఊరిడిసిపోవాల్ల!" ఊరంతా పొగలా పాకి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. వారిజీవితాల్లో అలజడి మొదలవుతుంది. గోదారిలో ఎవరిని దిగనియ్యరు. ఊరి పెద్ద, సర్పంచుల మాటవినే దిక్కులేదు. "గోదారి మీయమ్మాబాబుల పొత్తుకాదు. అది గవర్నమెంటుది. గవర్నమెంటు దాన్ని అమ్మేస్తుంది. ఒడ్డు పొడుగునా గోడలు కడుతుంది. దానిష్టం వచ్చినట్లు చేస్తది. అడగడానికి మీకే హక్కూ లేదు. అయినా అసలు మీ ఊరే ఉండదు... ఈ ఏరియానే ఉండదు... పోండి.. ఊరిడిసిపోయి ఇంకో చోటు వెదుక్కోండి... కాదని అల్లరి చేసినా... గోదారి దగ్గరి కొచ్చినా మర్యాద దక్కదు..." అని కాంట్రాక్టరు, పోలీసులు నిర్దయగా అరుస్తారు. ఊరు మీది కాదనటమే అమానవీయ్యచర్య. హక్కులేదనటం కన్న దుర్మార్గం ఇంకొకటి లేదు. మానవత్వం ఇక్కడ ప్రశ్నార్థకం.

మణికంఠకు ఆరోజు నిద్రపట్టదు. అనేక ప్రశ్నలకు అమ్మమ్మ చెప్పిన సమాధానాలు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. అందరు సంఘటితమైతే మనలను ఎవరు ఎమిచేయలేరనే సత్యాన్ని నరనరాన జీర్ణించుకుంటాడు. సంఘటితం కావాలంటే ఊరిమీద, గోదారిమీద ప్రేమపుట్టాలన్న అమ్మమ్మమాట రామబాణంలా బలంగా మనస్సులో నాటుకుంటుంది. ఆరోజునుంచి కన్నఊరిమీద ప్రేమను తట్టిలేపుతూ సంఘటితం చేయటం మొదలు పెడతాడు. కథ ఇక్కడ ముగుస్తుంది. వాస్తవానికి ఇది ఈ గ్రామం కథమాత్రమే కాదు. భారతదేశంలో అనే గ్రామాల కథ. ప్రభుత్వాలు పెత్తందారుల చేతిలో కీలుబొమ్మలుగా మారినవాస్తవ దృశ్యం ఇది.

“అతడు మనిషి” అద్దేపల్లి ప్రభుగారి మరోకథ. 2007 ఫిబ్రవరి విపులలో ముద్రించారు. మానవత్వాన్ని తట్టిలేపిన కథ. మనమంతా మనుషులమనీ, మనిషికి మనిషేసాయం చేయాలనే గొప్పసత్యాన్ని విపులంగా విడమరచి చెప్పినకథ. గోదారి బ్యాగ్‌డ్రాప్‌గా కథసాగుతుంది. వర్షం ఇందులో కన్వాస్ మాత్రమే.

కథ మొత్తం వెంకటేష్ మరియు పేదజాలరి చుట్టూ తిరుగుతుంది. పేదరికాన్ని ఇష్టపడని, చూడని వెంకటేష్ అనుకోకుండా ‘ఆదుర్రు’ వెళ్లాల్సి వస్తుంది. అమలాపురంలో బస్సు దిగి ఆటో పట్టుకొని బోడసకుర్రు రేవుకి చేరుకునేసరికి జోరుగా భీకరంగా వర్షం కురుస్తూవుంటుంది. గోదారి ఒడ్డునవున్న చిన్నబడ్డీకొట్టు చూరు కిందనిలబడి, కొట్టులో అతణ్ణి ఆవలికెళ్లడానికి లాంచీ కావాలనడుగుతాడు. ఈరోజుకి లాంచీలుండవనే సమాధానం వినగానే దిగాలుపడిపోతాడు. వాన అపూర్వంగా ఉంది. ఇలా దిక్కుతోచని స్థితిలో వెంకటేష్ బ్యాగ్‌ని నెత్తి మీద పెట్టుకొని గబగబా వర్షంలో నడుచుకుంటా భూమికి జానెడెత్తు పాకొకటి కనిపిస్తే దానిలోకి వెళ్లతాడు.

ఒక చిన్న ఇల్లు అది. చిన్నపాక, వంటిమీద బట్టలేని కుర్రాడు, కరెంటు లేదు, టి.వి.లేదు, సోఫాల్లేవు, డైనింగ్ టేబులు లేదు, ఫ్రిజ్‌లేదు, మంచాల్లేవు, ఏమిటి బతుకు? ఈ బతుక్కి ఒక లక్ష్యంలేదు. ఉన్నత స్థితికి ఎగబాకి పోవాలనే కిల్లింగ్ ఇన్‌స్టింక్ట్ లేదు. ఎలా బతుకుతున్నారీ బతుకుని? ఎందుకు బతుకుతున్నారు? ఒక జంతువులాగా... అనుకుంటాడు. బయట హోరు ధ్వని. ఆ ఇంటి మనిషి లోనికి రమ్మంటాడు. అతను పుల్లలపొయ్యిలో మంటవెలిగిస్తూవుంటాడు. వెంకటేషిని చూసి, తుడుచుకోటానికి కండవ ఇస్తాడు. వేడివేడిగా టీపెట్టిస్తాడు. వేడివేడి ఇప్పులతో కాపుకోమంటాడు. అయిష్టంగానే వెంకటేష్ అక్కడ ఉంటాడు. ఇంతలో ఆ ఇంటి ఇల్లాలు, పిల్లవాడితో వస్తుంది. వెంకటేష్‌ని చూసివారు ఏమాత్రం బయటవ్యక్తిగా భావించరు. ఆమె ఆ రాత్రిచేపలకూర వండుతుంది. ఆ వాసనకే వెంకటేష్‌కి నోరూరుతుంది. తన చిన్నప్పుడు కలిగిన ఆ అనుభూతి ఇప్పుడు అప్రయత్నంగా వస్తుంది. నోటికి వారి భోజనం కమ్మగా వుంటుంది. అక్కడే పడుకుంటాడు వెంకటేష్. తెల్లవారుతుంది. వర్షం తగ్గుతుంది. వెంటనే వెంకటేష్ భయలుదేరుతాడు.

గుమ్మం దగ్గర ఆమె నిలబడి చూస్తూవుంటే వెంటేష్ “సొంత అక్క కన్నా బాగా చూశారు నన్ను... మీకు నా.. నా.. థాంక్స్” నమస్కారం పెడతాడు. పాక మనిషి వెంకటేష్‌కి దారిచూపిస్తూ రొడ్డు వరకు వస్తాడు. పాక మనిషి ఆటో మాట్లాడటానికి ప్రయత్నంచేస్తాడు. కాని వర్షానికి వారు రావంటారు. దానితో పాక మనిషి ఈ రొడ్డువెంట కొంతదూరం వెళితే అక్కడ ఆటోగానీ, బస్సుగానీ ఉంటుందని అక్కడి నుండి మీరుకావలసిన ఊరికి పోవచ్చంటాడు. ఎలా వెళ్ళాలా అనుకుంటాడు వెంకటేష్. నడుచుకుంటా అని పాకమనిషి చెప్పేవరకు అతనికి కాళ్ళునడవటానికి ఉన్నాయనే విషయం గుర్తుకురాదు. వెంకటేష్ కొంత డబ్బుతీసి పాక మనిషికి ఇవ్వబోతాడు. అతను నవ్వి...

“మనిషి సుఖంగా ఉన్నప్పుడు యాపారం చెయ్యొచ్చు బాబూ కష్టంలో ఉన్నప్పుడు యాపారం చైకూడదు. రాత్రి మీరు కష్టంలో వచ్చారు. మీరు మడిసి, నేను మడిసిని, వానకి ముద్దైన పిట్ట చెట్టు మీద వాలబోతే చెట్టొద్దంటదా. ఇదీ అంతే” అంటూ గొప్ప మానవతా విలువని చాటిన కథ ఇది. అన్నీ తెలుసనుకొనే నాగరిక సమాజానికి పాక మనిషి ద్వారా రచయిత ఒక ప్రశ్న వేస్తాడు “రాత్రి ఉన్న పరిస్థితి... అలాంటి పరిస్థితిలో మడిసికి మడిసి సాయపడకపోతే ఇంకాణ్ణి మడిసనెలా అంటాం. ఇలాగే నాలాంటి మడిసి నీ ఇంటిముంగిట నిలిస్తే లోనికి రమ్మంటావా... బయటగ్గెంటేస్తావా...”

ఈ ప్రశ్నకి సమాధానం మనసులోనైనా అనుకోవడానికి వెంకటేష్‌కి భయమేసింది. ఇక మన పరిస్థితి ఎటు... నాగరికులమని చెప్పుకుంటున్న మనం, ఈ కథ చదివిన తరువాత నాకు అనాగరికులుగా కనిపిస్తున్నాము.

అద్దేపల్లి ప్రభుగారి 'ఇస్సాకు చిలక, ఊరు గోదారి, అతడు మనిషి' మూడు కథలు గొప్పగా మానవతా విలువలను చాటాయి. 'ఇస్సాకు చిలక' కథద్వారా ఊరంతా ఒక్కట్టే అనే భావాన్ని కలిగించారు, 'ఊరు గోదారి' పేదారికాన్ని చూపి సొంతవూరిని విడిచిపొమ్మనటం నేరమనే విషయాన్ని చెప్పారు, 'అతడు మనిషి' కథ మనిషినీ మనిషిగా చూడాలనే సందేశం ఇచ్చారు. ఈ విధంగా అద్దేపల్లి ప్రభుగారి కథలు మానవతా ధోరణులను వికసింపచేశాయి.

ఆధారగ్రంథాలు:

1. పాతికేళ్ల కథ (1990–2014), మొదటి భాగం, సం. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్
2. పాతికేళ్ల కథ (1990–2014), రెండవ భాగం, సం. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్
3. వందేళ్లకథకు వందనాలు, సం. గొల్లపూడి మారుతిరావు
4. తెలుగు వికీపీడియా – తెలుగుకథ